సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



ముగ్గురిని బలిగొన్న ప్రమాదం

సత్తుపల్లి మండలం గంగారం సమీపాన బైక్‌పై వెళ్తున్న ముగ్గురు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. 8లో



న్యాయవాదులకు క్రీడాపోటీలు

రానున్న పంద్రాగస్టును పురస్కరించుకుని న్యాయవాదులకు ఏర్పాటుచేసిన క్రీడాపోటీలను జిల్లా జడ్జి రాజగోపాల్ ప్రారంభించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరనున్న ఆయన 10–30గంటలకు చింతకానికి చేరుకుని రైతువేదికలో జిల్లా అధికారులతో దళితబంధు కార్యక్రమ అమలుపై సమీక్షిస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం 2–30 గంటలకు ముదిగొండ మండలం కమలాపురం నుంచి పమ్మి, జిల్లెలగూడ, అయ్యగారిపల్లి, అమ్మపేట వరకు రహదారుల నిర్మాణంతో పాటు అయ్యగారిపల్లి నుండి బాణాపురం తండా, ఎస్సీకాలనీ నుండి వెంకటాద్రి చెరువు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 4–30గంటలకు పమ్మిలో విద్యుత్ ఉప కేంద్రాన్ని భట్టి ప్రారంభించనున్నారు.

మెడికోలకు వార్షిక పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాస్తున్న ఎంబీబీఎస్ విద్యార్థులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బయోకెమిస్ట్రీ పేపర్–1 పరీక్ష ఉదయం 10నుండి 12–30 వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది విద్యార్థులకు గాను 99మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. పరీక్షలు 12వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు.

వయోజన విద్య డీడీగా జయశంకర్



జెడ్పీ సీఈఓ వినోద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జయశంకర్ (కుడి)

ఖమ్మం సహకారనగర్: వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా మాచర్ల జయశంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డీడీగా ఉన్న విక్రమవర్మను హైదరాబాద్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో హైదరాబాద్ వయోజన విద్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న జయశంకర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. దీంతో విధుల్లో చేరిన ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జెడ్పీ సీఈఓ వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆతర్వాత జయశంకర్‌కు కార్యాలయ ఉద్యోగులు సీహెచ్.అనిల్‌కుమార్, అరుంధతి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్ ఎస్‌ఈగా రామానుజస్వామి

ఖమ్మంవన్‌టౌన్: పంచాయతీరాజ్ శాఖ ఖమ్మం సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా ఎస్.రామానుజస్వామి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఖమ్మం ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఈమేరకు పంచాయతీరాజ్ శాఖ ఈఎన్‌సీ కనకరత్నం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎంతో ముఖాముఖికి జిల్లా ఉపాధ్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

ఖమ్మం సహకారనగర్: ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సమావేశం కానున్నారు. ఈనేపథ్యాన గురువారం ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడారు. జిల్లాలో పదోన్నతి పొందిన 1,155 మంది ఉపాధ్యాయులు హైదరాబాద్ వెళ్లనుండగా 24బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6గంటలకు ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల నుంచి బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ఈసమావేశంలో లైజనింగ్ ఆఫీసర్లు, రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దేవరకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు. కాగా, కల్లూరు మండలం పేరువంచ పాఠశాలలో విద్యార్థుల జుట్టు కత్తిరించడంతో ఇంగ్లిష్ టీచర్ శిరీషపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసేలా చూడాలని డీఈఓకు టీజేఏసీ అధ్యక్షుడు కొమ్మినేని అనిల్‌కుమార్ ఆధ్వర్యాన నాయకులు విన్నవించారు. ఈ ఘటనలో హెచ్‌ఎం వైఫల్యం కూడా ఉందని తెలిపారు.



ఎల్‌ఆర్‌ఎస్..

ఎల్‌ఆర్‌ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కోసం దరఖాస్తు చేసుకున్న స్థల యజమానుల ఎదురుచూపులకు తెరపడనుంది. ఈ స్కీమ్‌లో అందిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమావేశమై దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించగా.. ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. జిల్లాలో 51,425 దరఖాస్తులు ఉన్న నేపథ్యాన మూడు దశల్లో వడపోత అనంతరం అంతా సవ్యంగా ఉంటే అనుమతి ఇవ్వనుండడంతో లేఔట్ ఆమోదం లేని వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారి ఇబ్బందులు తీరనున్నాయి. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

- పరిష్కారానికి మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలోని కేఎంసీ, మున్సిపాలిటీల్లో 51,425 దరఖాస్తులు
- మూడు దశల్లో పరిశీలన.. అంతా సవ్యంగా ఉంటే ఆమోదం
- కొన్నేళ్లుగా దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- ఈసారైనా మోక్షం లభిస్తుందని ఆశాభావం

స్థలాల క్రమబద్ధీకరణ కోసం

పలువురు ఎలాంటి అనుమతి లేకుండానే లే ఔట్లు చేసి వెంచర్లు ఏర్పాటు చేయగా.. విషయం తెలియని వారు స్థలాలు కొనుగోలు చేశారు. ఆతర్వాత ఇంటి నిర్మాణాలకు ఇబ్బందులు ఎదురుకావడంతో స్థల యజమానులకు ఊరట కలిగించేలా లే ఔట్ ఆమోదం పొందని వెంచర్లలో కొనుగోలు చేసిన స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్‌ఎస్‌ను ప్రవేశపెట్టింది. 2020 ఏడాదికి ముందు పలుమార్లు దరఖాస్తులు ఆహ్వానించినా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కాలేదు. 2020లో మున్సిపల్ శాఖ 131 జీఓను విడుదల చేస్తూ ఆ ఏడాది ఆగస్టు 26కు ముందే స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే క్రమబద్ధీకరణ జరుగుతుందని వెల్లడించింది. ఈ నేపథ్యాన జిల్లాలోని ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో మొత్తం 51,425 దరఖాస్తులు వచ్చాయి. ఇందుకోసం ప్రతీ దరఖాస్తుదారుడు రూ.వెయ్యి చొప్పున చెల్లించారు.

వెంచర్ల పరిశీలన

ఎల్‌ఆర్‌ఎస్‌పై గత కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ప్రక్రియ వేగంగా సాగింది. టౌన్ ప్లానింగ్ అధికారులు దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో కొన్ని వెంచర్లను పరిశీలించారు. హైటెన్షన్ టవర్లు ఉన్నాయా.. వెంచర్ చెరువు, బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందా.. రాష్ట్రీయ, జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రతి పాదనలు ఉన్నాయా అనే వివరాలపై ఆరా తీశారు. పరిశీలన అనంతరం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఆన్‌లైన్ చేయాల్సి ఉండడంతో కొన్నింటిని పూర్తిచేశారు. ఆపై రెగ్యులరైజేషన్‌కు అనుమతించినట్లుగా దరఖాస్తుదారుడికి సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తి సమాచారం స్థలం మార్కెట్ విలువలో 14 శాతం ప్రభుత్వానికి చెల్లిస్తే స్థలాన్ని క్రమబద్ధీకరిస్తారు. కానీ ఆ సమయాన కొందరు కోర్టుకు వెళ్లడంతో పరిశీలన తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు. ఫలితంగా దరఖాస్తుదారుల సమస్య తీరకపోగా.. ప్రభుత్వానికి ఆదాయం నిలిచిపోయింది.

మార్గదర్శకాల విడుదలతో ఊరట

లే ఔట్ ఆమోదం లేదని తెలియక వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసిన ప్రజలు ఇంటి నిర్మాణ అనుమతులు లేక అవస్థ పడుతున్నారు. అలాగే స్థలంపై రుణం కూడా లభించడం లేదు. వీరంతా ఎల్‌ఆర్‌ఎస్ అమలవుతోందని ఆనందించినా దరఖాస్తులు పరిష్కారం కాకపోవడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. ఈ నేపథ్యాన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి అధికారులతో సమీక్షించి మార్గదర్శకాలను విడుదల చేయడంతో వారు ఊపిరి పీల్చుకుంటున్నారు.

కేఎంసీ, మున్సిపాలిటీల్లో అందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	పరిశీలించిన ప్లాట్లు	అనుమతి పొందినవి
ఖమ్మం కార్పొరేషన్	39,945	1,869	481
మధిర	4,276	645	49
సత్తుపల్లి	3,688	1,274	38
వైరా	3,516	588	25
మొత్తం	51,425	4,376	593

అన్నీ సవ్యంగా ఉంటేనే అనుమతి

తొలుత దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే క్షుణ్ణంగా పరిశీలించి వివాదాస్పద, ప్రభుత్వ భూముల్లో ఉన్న లేఔట్ అయితే తదుపరి ప్రక్రియ నిలిపేస్తారు. మొదటి దశలో ప్రభుత్వ రికార్డుల ఆధారంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటి పారుదలశాఖ ఏఈ, ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్, పంచాయతీ ఈఓ, యూఎల్‌బీ సిబ్బందితో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది. ఆపై రెండో దశలో సీపీఓ, టీపీఓ, డీపీఓలు పరిశీలించి లే ఔట్, రోడ్లు, జోన్ నిబంధన ఉల్లంఘనలు, ఖాళీ స్థలాలు వదిలేయడం వంటి అంశాలపై ఆరా తీస్తారు. ఇక చివరగా మూడో దశలో మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్లు, అదనపు కలెక్టర్లు పరిశీలించి లోపాలు ఉన్న వాటిని తిరస్కరించడమే కాక అంతా సవ్యంగా ఉన్న వాటికి అనుమతి జారీ చేస్తారు.

అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ



రఘునాథపాలెం : గణేశ్వరంలో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

రఘునాథపాలెం: జిల్లాలో అర్హులైన ప్రతీ రైతుకు ప్రభుత్వం అమలుచేసిన రూ.2లక్షల రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల తెలిపారు. రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో గురువారం ఆమె రుణమాఫీ పొందిన రైతులతో సమావేశమై మాట్లాడారు. దశల వారీగా జరుగుతున్న మాఫీలో అనుమానాల నివృత్తికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ పంటల పెట్టుబడి సమయాన రుణమాఫీ రావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆతర్వాత రుణమాఫీ అమలుకాని రైతుల సందేహాలను డీఏఓ, అధికారులు నివృత్తి చేశారు.

క్రయవిక్రయాలన్నీ నమోదు చేయాలి..

ఎర్రుపాలెం: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించడమే కాక వివరాలన్నీ రికార్డుల్లో నమోదు చేయాలని డీఏఓ షాపుల యజమానులను ఆదేశించారు. ఎర్రుపాలెం మండలం సఖినవీడు, రాజుపాలెం, మామునూరు, బనిగండ్లపాడుల్లో ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల గోదాంలను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు సందేహాల నివృత్తి కోసం ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. కాగా, జూన్ 28వ తేది లోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు బీమా కోసం ఈనెల 5వ తేదీలోగాపేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఏఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏఈఓలు బాలకృష్ణ, ధాత్రి, జిష్ణు, కృష్ణకుమారి, సుష్మ, దుర్గాప్రసన్న, సొసైటీ సీఈఓ బి.శివారెడ్డి పాల్గొన్నారు.

తల్లి పాలే శ్రేష్టం..



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు

ఖమ్మంవైద్యవిభాగం: బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమైనవని, రోగ నిరోధక శక్తి పెంపొందించేందుకు దోహదం చేస్తాయని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆస్పత్రి వైద్యులు, ఉద్యోగులు గురువారం ర్యాలీ నిర్వహించగా సూపరింటెండెంట్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. డబ్బా పాలతో ప్రయోజనం ఉండదని.. తల్లి పాలు కనీసం ఆరు నెలలు తాగించాలని తెలిపారు. ఈవిషయమై ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ బాబు రత్నాకర్, ఆర్‌ఎంఓలు రాంబాబు, వినాయక్ రాథోడ్, వైద్యులు పవన్‌కుమార్, రాంబాబు, యామిని, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిర, మిల్క్ బ్యాంక్ ఉద్యోగులు రమ్య, శ్రావణి, మానస, విజయ, రజిత, పావని, అనూషతో పాటు వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

‘సారథి’ కళాకారులకు పీఆర్సీ అమలు



అమరవీరుల స్తూపం వద్ద సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కళాకారులు

- రూ.24,514 నుంచి రూ.31,868కు పెరిగిన వేతనం
- ఉమ్మడి జిల్లాలో 28మందికి లబ్ధి

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు గత ప్రభుత్వం ప్రకటించిన పీఆర్సీ(పే రివిజన్ కమిషన్)ను అమలుచేస్తూ ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన కళాకారులను గుర్తించేలా గత ప్రభుత్వం 2015లో తెలంగాణ సాంస్కృతిక సారథి సంస్థను ఏర్పాటుచేసి ఎంపిక చేసిన వారికి నెలకు రూ.24,514 గౌరవ వేతనాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 28 మందికి అవకాశం దక్కింది. అయితే, 2021లో ఉద్యోగులకు పీఆర్సీ అమలుచేసే సమయాన కళాకారులకు సైతం వర్తింపచేయాలని భావించినా అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం కళాకారులకు గత ప్రభుత్వం రూపొందించిన పీఆర్సీనే అమలుచేస్తూ గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈనేపథ్యాన వీరికి రూ.24,514గా ఉన్న గౌరవ వేతనాన్ని రూ.31,868కు పెంచడమే కాక ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల వేతనాన్ని ఖాతాల్లో జమ చేశారు. దీంతో కళాకారులు ఖమ్మంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కళాకారులు పమ్మి రవి, కాల్వకట్ట జాన్ బొమ్మర ముత్యం, జల్లా నగేష్, రవి, గోవింద గురువయ్య, కొమ్ము రమేష్, హుస్సేన్, భద్ర, చాపలమడుగు కోటేశ్వరరావు, నకిరకంటి వెంకట్, పాగి వెంకన్న, మేడ ముత్తయ్య, పల్లెల రాము, పరిశాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

■ ఖమ్మంఅర్బన్: పీఆర్సీ అమలుచేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కళాకారులు ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటుచేయడమే కాక ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

5నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: పచ్చదనాన్ని పెంచడంతో పాటు వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈనెల 5 నుంచి 9వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ‘స్వచ్ఛదనం – పచ్చదనం’ పేరిట జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేయాలని ఆమె సూచించారు. హైదరాబాద్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ మాట్లాడుతూ అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు వెల్లడించారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, డీపీఓ హరికిషన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్, వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. గోవాలో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బి.గౌతమ్‌ను ఆయన అభినందించి మాట్లాడారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యం మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. నగరంలోని ఐటీ హబ్‌ను సందర్శించిన ఆయన కంపెనీల కార్యకలాపాలపై ఆరా తీశారు. అనంతరం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, లెర్నెట్ స్కిల్స్ జనరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫుడ్ అండ్ బేవరేజ్(స్టీవార్డ్) నైపుణ్య శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరేందుకు పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. సెంటర్ రీజనల్ మేనేజర్ అశోక్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ కీలకం..

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్, పక్కన అడిషనల్ డీసీపీలు

ఖమ్మంక్రైం: సైబర్ నేరాల ద్వారా సొమ్ము పోగొట్టుకున్న బాధితులు తొలి గంట(గోల్డెన్ అవర్) లో 1930కి కాల్ చేయడమో లేదంటే cybercrime.gov.in లో ఫిర్యాదు చేస్తే నిందితులు నగదు డ్రా చేయకుండా ఆపొచ్చని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఈ విషయమై విస్తృతంగా అవగాహన కల్పించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన అధికారులకు సూచించారు. కమిషనరేట్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సైబర్ నేరాలు, ఎన్డీపీఎస్ యాక్ట్, పోక్సో కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర కేసుల విచారణపై సీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల్లో ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే నగదు రికవరీ చేయడం ఆలస్యమవుతుందని చెప్పారు. కాగా, ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విజబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, సమాచార సేకరణలో క్రియాశీలకంగా ఉండడమే కాక మాదకద్రవ్యాల సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాల్లో నివారణ చర్యలు చేపట్టాలని, తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని సీపీ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు, శ్రీనివాసరావు, వెంకటేశ్, ప్రసన్నకుమార్, రవి, ఫణీందర్, సాంబరాజు, మల్లయ్య, బోజరాజు, సుశీల్‌సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

6నుంచి వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనర్సిరెడ్డి

వైరా: నుంచి వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఈనెల 6నుంచి నీరు విడుదల చేయనున్నారు. ఈమేరకు అధికారులు నిర్ణయించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన ఆయకట్టు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు వరినాట్లు వేసేందుకు అనువుగా నీటి విడుదలకు ఏర్పాట్లుచేస్తున్నారని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వివిధ పార్టీల నాయకులు, రైతులు కట్ల రంగారావు, దాసరి దానియేలు, చెరుకూరి చలపతిరావు, కిలారు సురేందర్, పారుపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ అధికారుల పర్యటన


నాచేపల్లిలో నాట్లు వేస్తున్న అధికారులు

నేలకొండపల్లి/ఏన్కూరు/కల్లూరురూరల్: గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల జీవన స్థితిగతులను పరిశీలించి అధ్యయనం చేసేందుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం పర్యటన కొనసాగుతోంది. జిల్లాలోని నేలకొండపల్లి మండలం నాచేపల్లి, ఏన్కూరు మండలం నాచారం, కల్లూరు మండలం కొర్లగూడెం, మధిర మండలం ఖమ్మంపాడులో పర్యటిస్తున్న వీరు గురువారం నాచేపల్లిలో రైతు కూలీలతో మాట్లాడి కాసేపు వరి నాట్లు వేశారు. అనంతరం వ్యవసాయాధికారులతో సమావేశమయ్యారు. అలాగే, నాచారంలోని పల్లె దవాఖానా, రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడంతో పాటు మహిళా సంఘాల సభ్యులతో సమీక్షించారు. ఇక కొర్లగూడెంలో తహసీల్, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, పాఠశాలను పరిశీలించారు. ఈ బృందాల్లో మోహన్ భారతి, అభిషేక్ దేశ్‌వాల్, ఆర్యమ యుగంనకర్, రమణదీప్, ప్రథమ్, రిధమ్, కరణభాటి, సచిన్‌భారతి, కుశల్, సాహిల్, భువనేష్ పాండే, రోహిత్ గోస్వై, సందీప్ ఠాకూర్, వికాస్‌కుమార్ ఉండగా ఎంపీడీఓలు ఎం.యర్రయ్య, సురేష్‌బాబు, ఎస్సై షాకీర్, వివిధ శాఖల ఉద్యోగులు అరుణకుమారి, సునీత, పి.బాబురావు, ఇబ్రహీం, బాబ్జీప్రసాద్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంక్ పని ఉందని బడికి తాళం !

కామేపల్లి: మండలంలోని గోపాలపురం ప్రాథమిక పాఠశాల గురువారం ఒక పూటే నడిచింది. ఈ స్కూల్‌లో 22మంది విద్యార్థులు ఉండగా ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ మధ్యాహ్నం రెండు గంటల సమయాన పిల్లలను ఇళ్లకు పంపించి తాళం వేసి వెళ్లిపోయాడు. దీంతో ఇళ్ల వద్ద ఆరా తీసిన తల్లిదండ్రులు హెచ్‌ఎం వెళ్లిపోయినట్లు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై హెచ్‌ఎం లక్ష్మణ్‌ను వివరణ కోరగా పాఠశాలకు సంబంధించి ఆడిట్ స్టేట్‌మెంట్ బ్యాంక్‌లో తీయాల్సి ఉండడంతో వెళ్లానని తెలిపారు. ఎంఈఓకి ఫోన్ చేస్తే అందుబాటులోకి రాకపోవడంతో బ్యాంక్ సమయం మించిపోతోందని హడావుడిగా వెళ్లినట్లు వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ముదిగొండ: మండలంలోని వల్లబిలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కోయ రేణుక ఇరవై రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లగా ఈ విషయాన్ని గమనించిన దుండగులు బుధవారం తాళం పగలగొట్టి చొరబడ్డారు. ఈమేరకు బీరువాలో దాచిన సుమారు రూ.5లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. తాళం పగులగొట్టిన విషయాన్ని విషయాన్ని అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి గురువారం ఉదయం గమనించి యజమానికి సమాచారం ఇచ్చాడు. దీంతో సీసీఎస్ సీఐ రాజు, ముదిగొండ ఎస్‌ఐ గజ్జెల నరేష్, క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరించారు. కాగా, ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

హాస్టల్ విద్యార్థినికి పాముకాటు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఉంటున్న ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థిని ఐశ్వర్యను గురువారం పాటు కాటేసింది. వసతిగృహం చుట్టూ పిచ్చిచెట్లు ఏపుగా పెరగగా, గురువారం రాత్రి హాస్టల్ ఎదుట ఉన్న విద్యార్థిని పాము కరవగా కేకలు వేసింది. దీంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తీసుకెళ్లారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

ముగ్గురిని బలిగొన్న రోడ్డుప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- ఒకే గ్రామానికి చెందిన బాలుడితో పాటు మరో ఇద్దరి మృతి
- స్కూల్ నుంచి వెళ్తూ లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కిన బాలుడు


ఘటనాస్థలంలో ముగ్గురి మృతదేహాలు


బేతి సురేష్, ముద్దిన వేణు, ఎస్.కే.కరీముల్లా (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ఆ మలుపు తిరిగితే రెండు నిమిషాల్లో ఇంటికి చేరేవారు.. కానీ విధి వి(క్రీ)కరించడంతో రోడ్డు ప్రమాదం రూపంలో ముగ్గురిని మృత్యువు కబళించింది. పాఠశాల నుంచి ఇంటికి బయలుదేరిన బాలుడు సహా ముగ్గురు మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం గంగారం సమీపాన గురువారం జరగగా వివరాలిలా ఉన్నాయి.

అమ్మమ్మ దశదిన కర్మ..

సత్తుపల్లి మండలం రామగోవిందాపురం గ్రామానికి చెందిన ముద్దిన వేణు(19) బేతి లక్ష్మి దశదినకర్మ గురువారం జరుగుతోంది. ఈనేపథ్యాన కూలీ పనులు చేసే వేణు, బేతి సురేష్(25) వరుసగా బావబావమరిది కాగా బైక్‌పై సాయంత్రం గంగారం వచ్చారు. అక్కడి నుంచి తిరిగి వెళ్లే క్రమాన వీరి గ్రామానికే చెందిన ఎస్.కే.కరీముల్లా(13) గంగారం హైస్కూల్‌లో చదువుతూ పాఠశాల విడిచిపెట్టడంతో బయటకు వచ్చాడు. బైక్‌పై వెళ్తున్న వేణు, సురేష్‌ను చూసి లిఫ్ట్ అడగగా వారు మధ్యలో ఎక్కించుకుని వెళ్తున్నారు. కొద్ది దూరం వెళ్లాక ఇంకాసేపైతే రామగోవిందాపురం చేరుకుంటారనగా గంగారం రింగ్ సెంటర్‌లో రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టారు. ఈ సమయంలో బైక్ వేగంగా ఉన్నట్లు తెలుస్తుండగా ముగ్గురి తలలు చిద్రమై తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, రింగ్ సెంటర్‌లోని పెట్రోల్ బంక్ దాటాక మలుపు తిరిగితే ఐదు నిమిషాల్లో గ్రామానికి చేరుకునేవారు. ఇంతలోనే జరిగిన ప్రమాదంలో ముగ్గురూ మృత్యువాత పడ్డారు.

రామగోవిందాపురంలో విషాదం

ఒకే గ్రామానికి ముగ్గురు మృతి చెందడం.. వేణు, సురేష్, కరీముల్లా ఇళ్లు పక్కపక్క వీధుల్లోనే ఉండడంతో విషయంలో తెలియగానే పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకున్నారు. స్కూల్ బ్యాగ్ వేసుకునే కరీముల్లా మృతదేహం రోడ్డుపై పడి ఉండడం, ముగ్గురు తలలు పగిలిపోవడంతో అటు బంధువులు, ఇటు స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుల్లో సురేష్‌కు వివాహమై నాలుగేళ్లు కాగా భార్య అనూష ఉంది. ఇక వేణుకు తల్లి జ్యోతి మాత్రమే ఉన్నారు.

తండ్రికి ఆలస్యం కావడంతో..

రామగోవిందాపురం గ్రామానికి షేక్ వజీర్, సలీమున్నీసాబేగం కుమారుడు కరీముల్లా. గంగారంలో టైర్ పంక్చర్ మెకానిక్‌గా పనిచేసే వజీర్ ప్రతిరోజు తన బైక్‌పై కరీముల్లాను స్కూల్ వద్ద దిగబెట్టి తీసుకొస్తాడు. కానీ షెడ్‌లో ఆలస్యం కావడంతో ఈరోజు వెళ్లకపోగా తమ గ్రామానికే చెందిన సురేష్, వేణు కనిపించడంతో బైక్ ఎక్కిన విద్యార్థి మృతి చెందడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంతో గంగారంలోని జాతీయ రహదారిపై ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు చేరుకుని మృతదేహాలను మార్చురీకి తరలించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

న్యాయవాదులకు క్రీడా పోటీలు


క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్న మహిళా న్యాయమూర్తులు

ఖమ్మం లీగల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు న్యాయవాదులకు గురువారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ మేరకు సర్దార్ పటేల్ స్టేడియంలో వాలీబాల్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ప్రారంభించారు. ఇందులో నాలుగు జట్లు తలపడగా గరిక సంపత్, మర్రి ప్రకాష్ జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇక కబడ్డీ పోటీల్లో మూడు జట్లు పాల్గొనగా కె.కృష్ణ, గరిక సంపత్ జట్లు మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పోటీలను తన్నీరు పాపయ్య, తాళ్ల వెంకటనారాయణ మర్రి ప్రకాష్, రామబ్రహ్మం పర్యవేక్షించారు. అలాగే, బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి తన్నీరు లలిత ఆధ్వర్యాన న్యాయమూర్తులకు క్రీడాపోటీలు నిర్వహించగా క్యారమ్స్‌లో కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి అర్చనాకుమారి, అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి కల్పన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి బిందు ప్రియ పాల్గొన్నారు. ఇందులో అర్చనాకుమారి జట్టు విజయం సాధించింది.

ఎస్సీ వర్గీకరణ తీర్పు చరిత్రాత్మకం

మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఎంతకీలకమో.. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో మందకృష్ణ మాదిగ పాత్ర అంతే కీలకమని చెప్పారు. 1995లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయాన తన పేరుతో ఇచ్చిన విజిటర్ పాస్‌తో అసెంబ్లీలోకి వచ్చిన యువతి మేరీ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి అసెంబ్లీ భవన్‌పై నినాదా లు చేసిందని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ గతంలో ప్రధాని మోదీతో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియపై వినతిపత్రాన్ని అందచేశారని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణపై వెలువడిన తీర్పు కొందరి విజయం, మరికొందరి అపజయమో కాదని.. ప్రతీ ఒక్కరి విజయమని సండ్ర వెల్లడించారు. ఈమేరకు రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు విద్య, ఉద్యోగ నోటిఫికేషన్లలో రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు సండ్ర పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టింది ఆడబిడ్డలను అవమానించేందుకేనా అని ఆయన ప్రశ్నించారు.

ఈ సమావేశంలో ఎంపీపీ బెల్లం ఉమ, నాయకులు బెల్లం వేణుగోపాల్, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, లీనగబోయిన సతీష్, నెమలి కిషోర్, హెచ్చు ప్రసాద్, వీరభద్రం, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో చెప్పారు. ఈ తీర్పుతో మాదిగలు చేసిన పోరాటం ఫలించిందని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు బీఆర్‌ఎస్ చిత్తశుద్ధితో కృషి చేయగా.. మిగతా పార్టీలు ఓట్ల కోసం రాజకీయం చేయడమే కాక ఎస్సీలను మోసం చేశాయని వ్యాఖ్యానించారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ మాత్రమే ఈ అంశాన్ని సామాజిక న్యాయంలో భాగంగా చూసి సంపూర్ణ మద్దతు ఇచ్చారని తెలిపారు.

పేదలు, కష్టాలు ఉన్నంతవరకు కమ్యూనిజం


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

బోనకల్: పేదలు, కష్టాలు ఉన్నంత కాలం కమ్యూనిజం అజేయంగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మండలంలోని ఆళ్లపాడులో గురువారం జరిగిన సీపీఎం నాయకురాలు వెంకట్రావమ్మ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు ఉద్యమం సాదాసీదాగా సాగేది కాదన్నారు. కష్టాలు, కన్నీళ్లతో ఉద్యమాలు కొనసాగుతాయని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీని అడ్డం పెట్టుకుని పదవులు, డబ్బు సంపాదించడం కుదరదని తెలిపారు. కాగా, వెంకట్రావమ్మ భర్త వెంకటేశ్వరావు హత్యకు గురైనా ఆమె పార్టీలో చురుకుగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, నాయకులు బండి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరావు, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్ తల్లి భారతమ్మ (80) గురువారం ఖమ్మంలో మరణించగా పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, నున్నా నాగేశ్వరరావు నివాళులర్పించారు. నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, బుగ్గవీటి సరళ, వై.విక్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, సీహెచ్.కోటేశ్వరరావు, బొంతు రాంబాబు తదితరులు ఉన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ శాఖలో మరికొందరు ఉద్యోగులను బదిలీ చేస్తూ శాఖ కమిషనర్ ఎం హన్మంతరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా 11 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఈ.గౌరీశంకర్‌ను వరంగల్ డీసీ కార్యాలయానికి, అక్కడ సూపరింటెండెంట్ ఉన్న ఎం.వీరస్వామిని ఖమ్మంకు బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం పర్యవేక్షకురాలు రెంటాల సమతను వరంగల్ డీసీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా, వరంగల్ సీనియర్ అసిస్టెంట్ అనిల్‌ను ఖమ్మం ఏసీ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అంతేకాక కల్లూరు శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయ మేనేజర్ ఎస్‌వీడీ.ప్రసాద్‌ను ఏన్కూరు మండలం గార్లొడ్డు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి, అశ్వారావుపేట చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం మేనేజర్ బీమవరపు సూర్యప్రకాష్‌ను కల్లూరు శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయానికి బదిలీ చేశారు. కాగా, ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏ .సులోచనను నల్లగొండ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేసినప్పటికీ ఖమ్మం ఇన్‌చార్జ్ ఏసీగా కొనసాగిస్తున్నారు. కొన్నాళ్ల తర్వాత మరెవరికైనా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలిసింది.

ఖమ్మం మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్

నాలుగు మార్కెట్లకు పద్మావతి


ఉప్పల శ్రీనివాస్

ఖమ్మంవ్యవసాయం: మార్కెటింగ్ శాఖలో అధికారులు, ఉద్యోగుల బదిలీల నేపథ్యాన ఖమ్మం మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మార్పు జరిగింది. ఖమ్మం మార్కెట్‌కు పాలకవర్గం లేకపోవడంతో మార్కెటింగ్ శాఖ వరంగల్ ఆర్‌జేడీగా ఉన్న మల్లేశం పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌కు బదిలీ కాగా, వరంగల్ ఆర్‌జేడీగా నియమితులైన ఉప్పల శ్రీనివాస్‌ను ఖమ్మం మార్కెట్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. ఇక మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) ఏ.రాజు నేలకొండపల్లి, మధిర వ్యవసాయ మార్కెట్లకు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా ఆయన సైతం హైదరాబాద్‌కు బదిలీ కావడంతో కరీంనగర్ డీడీ పద్మావతి వరంగల్‌కు వచ్చారు. దీంతో ఆమె నేలకొండపల్లి, మధిర మార్కెట్లకే కాక ఇల్లెందు, బూర్గంపాడు మార్కెట్లకు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

ఏన్కూరు ప్రిన్సిపాల్‌గా సింహాచలం


సింహాచలం

ఏన్కూరు: ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సింహాచలం నియమితులయ్యారు. ఈమేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఇక్కడ పనిచేసిన హెచ్.వెంకటేశ్వరావు బదిలీపై భద్రాచలం వెళ్లారు.

విధుల్లో చేరిన అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న పలువురు అధ్యాపకులను బుధవారం బదిలీ చేయగా వారి స్థానంలో నియమితులైన వారు గురువారం విధుల్లో చేరారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో 42మంది, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏడుగురు విధుల్లో చేరారు.

సీడీపీఓలకు స్థానచలనం

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలువురు సీడీపీఓల బదిలీ జరిగింది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బదిలీ అయిన సీడీపీల వివరాలిలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.కవిత	ఖమ్మం అర్బన్	మధిర
సీహెచ్.నిర్మలజ్యోతి	చంద్రుగొండ (న్యూ)	కల్లూరు
బోడపట్ల సరస్వతి	అశ్వారావుపేట టౌన్	తిరుమలాయపాలెం
దారా సలోమి	బూర్గంపాడు టౌన్	చంద్రుగొండ
కనకదుర్గ	తిరుమలాయపాలెం	సత్తుపల్లి
పి.జయలక్ష్మి	ఖమ్మం రూరల్	మణుగూరు
కొలిశెట్టి అరుణకుమారి	టేకులపల్లి	ఇల్లెందు
జె.బాల త్రిపురసుందరి	తిరుమలాయపాలెం	మధిర
ఎం.లక్ష్మీప్రసన్న	ఇల్లెందు	పాల్వంచ
జి.శారదాశాంతి	మధిర	ఖమ్మం రూరల్
జె.రత్నకుమారి	దమ్మపేట	తిరుమలాయపాలెం
బి.వీరభద్రమ్మ	మధిర	ఖమ్మం అర్బన్

113 మంది అధ్యాపకులు, సిబ్బంది బదిలీ

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: ఇంటర్‌మీడియట్ విద్యాశాఖలో 113మంది అధ్యాపకులు, ఉద్యోగులను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు విడుదలయ్యాయి. జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్లు, ఉద్యోగులకు స్థానచలనం కలగగా వీరిలో పలువురు గురువారం విధుల్లో చేరారు. మిగతా వారు ఒకటి, రెండు రోజుల్లో చేరనున్నారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. కాగా, నేలకొండపల్లి కాలేజీ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణశాస్త్రి మధిర మండలం సిరిపురం కాలేజీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో దుమ్ముగూడెం నుంచివచ్చిన ఎల్.వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు.

రఘునాథపాలెం ఎంఈఓగా రాములు


ఎంపీడీఓకు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న ఎంఈఓ

రఘునాథపాలెం: రఘునాథపాలెం ఎంఈఓగా బి.రాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంఈఓగా ఉన్న ఎం.శ్రీనివాస్ ఖమ్మం రూరల్ మండలానికి బదిలీ కాగా సత్తుపల్లి నుండి రాములు ఇక్కడకు వచ్చారు. ఎంపీడీఓ అశోక్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టు ఇవ్వగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అదుపు తప్పి రోడ్డుపై లారీ బోల్తా

- భారీగా ట్రాఫిక్ జామ్
- రాత్రి పొద్దుపోయే వరకు వాహనదారుల అవస్థలు


ఘటనాస్థలిలో పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్


కొణిజర్ల సమీపాన రోడ్డుకు అడ్డంగా పడిన లారీ


పెద్దసంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

కొణిజర్ల: వేగంగా వెళ్తూ ముందు వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమాన అదుపు తప్పిన లారీ నడిరోడ్డుపై బోల్తా పడింది. ఈఘటన కొణిజర్లలో గురువారం సాయంత్రం జరగగా వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలోని సంగోరా ప్రాంతం నుండి కోల్‌కతాకు దానిమ్మకాయల లోడ్‌తో వెళ్తున్న లారీ డ్రైవర్ కొణిజర్ల పోలీస్‌స్టేషన్ దాటాక ముందు వెళ్తున్న బస్సును అధిగమించే ప్రయత్నం చేయగా ఎదురుగా మరో వాహనం రావడంతో ఒక్కసారిగా పక్కకు తిప్పాడు. లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈక్రమాన లారీ సత్తుపల్లి డిపో ఆర్టీసీ బస్సు వెనకభాగంలో తాకడంతో స్వల్పంగా ధ్వంసమైంది. అయితే, బస్సుపై పడి ఉంటే భారీ ప్రమాదం జరిగేదని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ రాజారామ్, క్లీనర్ ప్రమోద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, లారీ రోడ్డుకు అడ్డంగా పడడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఖమ్మం వైపు తనికెళ్ల వరకు, వైరా వైపు పల్లిపాడు వరకు సుమారు 5 కి.మీ. మేర ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వైరా ఏసీపీ రెహమాన్ ఆధ్వర్యాన పోలీసులు రాత్రి వరకు శ్రమించి మూడు భారీ క్రేన్లతో లారీని పక్కకు తప్పించి రాకపోకలను క్రమబద్ధీకరించే సరికి రాత్రి పొద్దుపోయింది.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

కారేపల్లి: మూలమలుపు వద్ద అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. మాధారం నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని రావోజీతండా వద్ద మూలమలుపులో అదుపుతప్పింది. ఈక్రమంలో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నియంత్రించగా పొలాల్లోకి దూసుకెళ్లి ఆగింది. ఈ సమయాన బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా అంతా సురక్షితంగా బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఆటోడ్రైవర్‌పై సర్జికల్ బ్లేడ్‌తో దాడి

వీపు భాగంలో 80 కుట్లు


చికిత్స పొందుతున్న పవన్‌సాయి

ఖమ్మంక్రైం: ఖమ్మం బుధవారం అర్ధరాత్రి దాటాక ఓ ఆటోడ్రైవర్‌పై మరికొందరు ఆటోడ్రైవర్లు సర్జికల్ బ్లేడ్లతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్త బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ అడ్డా ఉండగా.. అక్కడి ఆటోడ్రైవర్లు నెలనెలా డబ్బు చెల్లిస్తున్నారు. ఈక్రమంలో బస్‌డిపో రోడ్డు ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ పవన్‌సాయి బుధవారం అర్ధరాత్రి అక్కడకు రాగా ఇతర డ్రైవర్లు అడ్డాకు డబ్బు చెల్లించాలని సూచించారు. దీంతో ఆయన కష్టపడి ఆటో నడుపుతున్నందున డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించాడు. ఈమేరకు వాగ్వాదం జరగగా, సాయిపవన్ వెళ్లిపోయాడు. అనంతరం బస్‌డిపో జెండాల సెంటర్‌లో కాపు కాసిన ఎనిమిది మంది ఆటోడ్రైవర్లు పవన్‌సాయిని ఆటోలో నుంచి లాగి సర్జికల్ బ్లేడ్లతో దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆయన వీపు భాగం పలుచోట్ల తెగిపోగా 80 కుట్లు వేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ వెల్లడించగా.. పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

జ్వరంతో బాలుడు మృతి

కారేపల్లి: జ్వరంతో బాధపడుతున్న బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని పరిధిలోని గుంపెళ్లగూడెంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ వీరభద్రం పాల్వంచలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వర్తిస్తుండగా, ఆయన భార్యకు హైదరాబాద్‌లో డీఎస్సీ పరీక్ష ఉండడంతో గతనెల 30న ఇద్దరు కుమారులను నానమ్మ వద్ద ఉంచి వెళ్లారు. అప్పటికే జ్వరంతో బాధపడుతున్న వీరి చిన్న కుమారుడు(8)కి వైద్యం చేయించడంతో పాటు హైదరాబాద్ వెళ్లొచ్చాక పెద్దాస్పత్రిలో చూపించాలని అనుకున్నారు. ఇంతలోనే బాలుడికి జ్వరం పెరిగి రక్త విరోచనాలు కావడంతో తల్లిదండ్రులు వచ్చేలోగా కన్నుమూశాడు. దీంతో కన్నీరుమున్నీరవుతూ గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.